

# కథా కౌముది

## పునాది - డా. సమ్మెట విజయ

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

"**సుబ్బారావుగారూ!** నమస్కారం.. ఎక్కడికో బయలుదేరారు" రోడ్డు మీద నడుస్తూ పక్కనే ఉన్న సుబ్బారావుగారిని పలకరించాను.

"పక్కనే సూపర్ మార్కెట్‌కి. మీరెక్కడికి?" నవ్వుతూ సమాధానమిచ్చాడు సుబ్బారావు.

"నేనూ అక్కడికే పదండి" అంటూ అనుసరించాను. పక్క పక్క వీధుల్లోనే ఉంటాము. అప్పుడప్పుడూ కలుసుకుంటాం. పదవీ విరమణ తర్వాత కలిగిన పరిచయాలు. ఉదయపు నడకలో పెరిగిన అనుబంధం.

"ఏమిటి విశేషం మీ అబ్బాయి వస్తున్నాడా?"

"నెలాఖరులో ఆఫీసుపని మీద రెండురోజులు వస్తునాడు. ఏం సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలో! వాడు బెంగుళూరులో మేమిక్కడ. వాడికిష్టమని నిన్న సంతలో పండుమిరపకాయలు, చింతకాయలు కొన్నాం కదా. వాటినిప్పుడు పచ్చడి పెట్టాలని నూనె, చింతపండు, కారం పట్టుకురమ్మని పంపింది మా ఆవిడ" అన్నారు సుబ్బారావు.

"మొన్ననేగా ఎవరో దబ్బకాయలు యిచ్చారని పచ్చడి పెట్టారన్నారు."

"మీరు భలేవారే అది దబ్బకాయకదండీ. ఇది పండు మిరపకాయ. పెట్టాక మా ఆవిడతో చెప్పి చిన్న డబ్బాలు తెచ్చిస్తా ఓ ముద్ద తిని అప్పుడు చెప్పండి. మా రాధ పచ్చళ్ళు పెట్టడంలో ఆమె కామే సాటి" గర్వంగా చెప్తున్నారు సుబ్బారావు.

ఆయన మాటలు వింటుంటే నోట్లో నీళ్ళూరసాగాయి. మా లావణ్యకంత టైం ఉండదు పాపం. ఉద్యోగానికి వెళ్ళి అలిసిపోయి వస్తుంది. పోనీ నేను సహాయం చేస్తాను అంటే వినిపించుకోదు. ఆఫీసునుంచి వచ్చేసరికే రాతి తొమ్మిది. వంటమనిషి చేసే వంటలకు అలవాటు పడిపోయి విసుగొస్తోంది. పంచదార, గోధుమపిండి ప్యాకెట్లు తీసుకుని ఆయన్ననుసరించాను.

"ఏమిటి రామచంద్రంగారూ. అలా నీరసంగా ఉన్నారు?" అడిగారు సుబ్బారావుగారు.

"అబ్బే ఏం లేదండి.. మీరు పండుమిరపకాయ పచ్చడి అంటుంటే మా అమ్మ గుర్తొచ్చింది. గోంగూర పచ్చడి, నిమ్మకాయ పచ్చడి, అల్లం పచ్చడి, ఆవకాయ. ఆ ఆవకాయలో ఎన్ని రకాలో. అన్నట్టు టమాటా పచ్చడి, చింతకాయ తొక్కు ఆహా ఎన్ని పెట్టేదండి. ఇదిలా ఉండగ ఏ రోజుకారోజు రోటి పచ్చడి ఏదో ఒకటి చేయకపోతే ఆవిడకు ముద్ద దిగేదికాదు. ఈ రోజు ఏం పచ్చడి చేద్దామా అనే ఆలోచనలోనే ఉండేది. అనుకున్నది చేసేది. చేసింది పక్కింట్లో కాస్త, ఎదురింట్లో కాస్త పెట్టి రుచిచూపించేది. ఎంతైనా సుబ్బారావుగారూ ఆ కాలమే వేరు" నిట్టూర్చాను.

"నిజమే మా ఆవిడ ఉద్యోగం చేయక ఇంకా ఆ వాసనలు పోలేదు. అన్నీ చేయాలని తాపత్రయం. ఏదో కష్టపడుతుంది. ఎందుకూ అబ్బాయి బెంగుళూరులో ఉంటాడు. వాడికి పంపించాలని. అమ్మాయిది ఢిల్లీ. ఆమెకి పంపించాలని. ఉన్నా మేమిద్దరం ఈ వయసులో బీపీలు, షుగర్ తో ఏం తింటాం చెప్పండి?"

"అంతేలెండి. వస్తాను సార్" మా వీధి సందు రాగానే ముందుకు సాగాను. ఇంట్లోకి అడుగుపెట్టగానే "పంచదార తెచ్చారా అయ్యగారూ. కాఫీ కలిపివ్వనా?" వంటమనిషి సరోజ వచ్చేసి రెడీగా ఉంది.

"ఇవ్వమ్మా" వాలుకుర్చీలో సాగిలపడ్డాను. కళ్ళు మూసుకుంటే ఎన్నెన్నో ఆలోచనలు. పల్లెటూరులో అమ్మా, నాన్నలతో గడిపిన కాలం, తీయని జ్ఞాపకాలెన్నో. చదువుకునే రోజుల్లో నాన్న రెక్కల కష్టంతో వ్యవసాయం చేసి పట్నానికి పంపి ఫీజులు కట్టి చదివిస్తే పెద్ద ఉద్యోగస్థులుగా మారి పెళ్ళిళ్ళు చేసుకుని పట్నానికి మకాం మార్చేసి ఏ చుట్టపు చూపుగానో కన్న తల్లిదండ్రులను చూసి వచ్చే వాళ్ళం నేనూ, తమ్ముడూ.

పొద్దున్నే లేవగానే వాకిలి ఊడ్చే కార్యక్రమం ఓ గంట. అమ్మ ఇంటిముందు, చుట్టూరా ఊడ్చి, బకెట్లు పేడనీళ్ళు కలిపి కళ్ళాపి చల్లి ఆరేలోపు పిడకలతో పొయ్యి వెలిగించి గంగాళం నిండా నీళ్ళుకాచి అలికిన వాకిట్లో పెద్ద పెద్ద ముగ్గులు వేసేది. ఏ ముగ్గు కా ముగ్గు గొప్ప చిత్రకారుడు గీచిన చిత్రంలా ఉండేది. ఇక్కడ సంక్రాంతి వస్తేనే ముగ్గులు గుర్తుకొస్తాయి. అక్కడ ప్రతిరోజూ ప్రతి వాకిలి సంక్రాంతి శోభను సంతరించుకునేది. నీళ్ళుకాగాక రెండు కట్టెలు తెచ్చి పొయ్యిలో గుచ్చి అదే పొయ్యి మీద వంట చేసేది. కట్టెల పొయ్యి మీద వంట రుచికి ఈనాటి గ్యాసు పొయ్యిలకి ఎంత తేడా!.

"అయ్యగారూ కాఫీ" వంటమనిషి సరోజ.

తేరుకుని కాఫీ తాగుతుంటే ఇప్పుడు కాఫీలకి, టీలకి అలవాటు పడిపోయాం. అప్పుడైతే అప్పుడే పితికిన పాలు చిక్కగా కాచి ఇస్తే కమ్మగా ఇంత పొడుగు గ్లాసు అమృతంలా తాగేసేవాళ్ళం.

"పుల్కా చేయమంటారా అయ్యగారూ?" గోధుమ పిండి పొట్లం తీస్తూ అడిగింది సరోజ.

"ఉండు అమ్మగారు చెప్తారు" లావణ్యకి ఫోన్ కలిపి సరోజకిచ్చా. ప్రతిరోజూ రాత్రిపూట మార్పులేని పుల్కాలనబడే రొట్టెముక్కలు తినాల్సిందే ఈ మధ్య ఆరోగ్యం, పోషకపదార్థాలు, జాగ్రత్తలూ అంటూ తిండిమీద అందరికీ విపరీతమైన శ్రద్ధ పెరిగి పోయింది. వంటలకోసం ప్రత్యేక ఛానళ్ళే వచ్చేశాయి. ఎన్ని రుచికరమైన వంటకాలు చేసినా ఏదో వెలితి అనిపిస్తోంది. నానబెట్టిన మినప్పప్పుని రోట్లో రుబ్బి రవ్వ కలిపి సన్నని సెగమీద నిదానంగా ఎర్రగా కాల్చి పెట్టే దిబ్బరొట్టె, వేడి వేడి నూనెలో వేసే పునుగులు, వడలు, రోటిలో రుబ్బే రోటి పచ్చళ్ళు పెట్టుకుని తింటే వేరే ఏ రుచులు కావాలనిపిస్తుంది? ముద్దపప్పు చేసి దొడ్లో కాసిన నాలుగు కాయగూరలు తుంచి ముక్కల పులుసు పెడ్తే నెయ్యి వడ్డించుకుని తింటే స్వర్గం తిరిగిరాదూ! అవన్నీ ఈ కాలం పిల్లలకి ఏం తెలుసు? పిజ్జా కావలా ? బర్గర్ తింటారా అంటారు.

వయసు పెరిగే కొద్దీ అభిమానం పెరిగి "మాత్ర వేసుకున్నారా?" అని గడిగడికి అడుగుతుంటారు. భోజనానికి ముందు తర్వాత మాత్రలు జీవితంలో అంతర్భాగంగా నిలిచిపోయాయి.

మనం మన పిల్లలకి ఏం చూపించాము? వాళ్ళకేం తెలుసు? ఉద్యోగస్థులుగా నేను, తమ్ముడు చుట్టపు చూపుగా వచ్చి పోయేవాళ్ళం. ఉన్న కాస్సేపు ముళ్ళమీదున్నట్లుగా ఉండేవాళ్ళం. పైగా పట్నం నుంచి రావడం విమానం దిగి వేరే దేశం నుంచి వచ్చినట్టుగా బెట్టుగా మనముంటే పట్నం నుంచి పల్లెటూరికి విచ్చేసిన మనల్ని మాత్రం వాళ్ళు ఆకాశం నుండి దిగివచ్చిన దేవతల్లా అతిథిమర్యాదలు చేస్తుంటారు. ఈ వ్యత్యాసం ఎందువల్ల ఏర్పడింది?

కృత్రిమ వాతావరణంలో పెరిగి మనమూ కృత్రిమంగా తయారవడం వల్లేనా? కళ్ళుమూసుకుని ఆలోచనల్లో పడ్డ నాకు అయ్యగారూ "రొట్టెలు, కూరా చేసేసా" వస్తానని సరోజ చెప్పడంతో తలుపు వేయడానికి లేచాను. ఇంతలో ఫోన్ మోగింది.

"నాన్నా నేను కిరణ్‌ని" అమెరికానుంచి కొడుకు ఫోన్. ఒక నెలరోజులు సెలవు మీద అమెరికా నుంచి ఇక్కడికి కుటుంబ సమేతంగా వస్తున్నాడట. ఒక్కసారిగా వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లు అటూ ఇటూ పచార్లు చేయసాగాను. లావణ్య వచ్చేవరకు తిరుగుతూనే ఉన్నాను. రాగానే చెప్పేశాను.

"అవునా? ఎంత మంచి వార్త చెప్పారండీ. ఇంకో సంవత్సరం ఈ ఉద్యోగం నాకు తప్పదు. విసుగ్గా ఉంది ఈ పని వేళలతో యంత్రాల్లా. అబ్బాయి, కోడలు రాగానే సెలవు పెట్టుకుని ఎక్కడికన్నా వెళ్దాం ఎంచక్కా" అంది

"కొంపదీసి ఏ ఊటీకో కొడైకెనాల్‌కో వెళ్దామంటావా?"

"ఎందుకూ వాడు ఉంటున్నదే మంచు ప్రదేశంలో. ఎక్కడికీ వద్దు. ఎంచక్కా మన ఊరికి వెళ్దామండీ. అత్తయ్యగారూ, మామయ్యగారు, మీరు పెరిగిన ఊరిలో ప్రశాంతంగా ఉండి వద్దాం."

ఎంతైనా నా శ్రీమతి కదా. నా మనసులోని మాట తన నోటిలో నుంచి వచ్చింది.

కృత్రిమ ఆకర్షణలు నుంచి సహజ వాతావరణంలోకి ఎప్పుడు వెళ్తానా అని నా మనస్సు ఉవ్విళ్ళూరసాగింది. భోంచేసి పడుకున్నానేగానీ కలలో మేమంతా మా ఊరు వెళ్ళినట్లు నా మనవరాలు వామనగుంటలు ఆడుతున్నట్లు, మనవడు గాలిపటాలు ఎగరేస్తున్నట్లు, కోడలు అక్కడి కోనేరులో తామరపులు కావాలని అడుగుతున్నట్లు కొడుకు ఆ పాత ఇంటికి కొత్త హంగులు రూపొందిస్తున్నట్లు రాత్రంతా ఊహాగానాలతో గడిచింది.

తెల్లవారగానే ఉదయపు నడకకు ఎప్పుడు వెళ్తానా ఎప్పుడు కిరణ్ రాకని అక్కడి మిత్రులతో పంచుకుంటానా అని ఆత్రంగా గడిపాను.

నా ముఖం చూస్తూనే సుబ్బారావుగారు పలకరించారు. "ఏంటండీ రామచంద్రరావుగారు హుషారుగా ఉన్నారు. ఏమిటి విశేషం?"

"భలే కనిపెట్టారండి" అంటూ కిరణ్ కుటుంబ సమేతంగా రావడం గురించి చెప్పాడు.

"చాలా సంతోషం దేశం కాని దేశంలో ఉంటూ మనదేశం వస్తున్నారు. మీ వాడికి తెలియనిదేమీ లేదుకాని. మీ మనవడు, మనవరాలుకి మీరు చూపించే ప్రదేశాలే అసలు భారతదేశం. అది గుర్తుంచుకుని చూపించండి"

"అదేనండి అందుకే భారతదేశం చూడాలి అంటే మన పల్లెటూర్లు చూడాలి. అందుకే మేము మా స్వగ్రామం వెళ్ళాలనుకుంటున్నాం. మా లావణ్య కూడా అదే అంది" చెప్పాను గొప్పగా.

"మీరు ఊహించినట్లుగా జరిగితే సంతోషమే" అన్నారు సుబ్బారావుగారు.

పిల్లలు వచ్చేసరికి తయారు చేయవలసిన పిండివంటల ఏర్పాట్లలో ఆ వారమంతా తీరికలేకుండా గడిచిపోయింది.

కిరణ్ వస్తున్నాడని పూనేలో ఉన్న కూతురు సుమకి కబురు చేసాను. సుమకి ఇద్దరు కొడుకులు.

అనుకున్నరోజు రానే వచ్చింది. ముందుగా సుమ, తర్వాత కిరణ్ వరుసగా వచ్చేశారు. కోడలిని, మనవళ్ళని, మనవరాలిని చూసి మురిసిపోయింది లావణ్య. నాకైతే పండుగే. స్కైపుల్లో చూడటం మాట్లాడటం వేరు, ప్రత్యక్షంగా వారితో గడిపింది ఎప్పుడని కళ్ళు చెమర్చాయి.

వచ్చినప్పటి నుంచి సుమ పిల్లలు, కిరణ్ పిల్లలు ఒకరికొకరు అలవాటు పడడానికి కొంత సమయం పట్టింది. ప్రతిదీ "వాటీజ్ దిస్" "వాటీజ్ దిస్" అంటూ అడిగి తెలుసుకుంటున్నారు కిరణ్ పిల్లలు. ప్రతిదానికీ బెట్టు చేస్తున్నారు సుమ పిల్లలు. మొదట్లో ఏదో అనుకున్నాను. తర్వాత గమనించి చూస్తే నిజంగానే చాలా పెద్ద వెలితి అనిపించింది. ప్రతిదానిపట్ల ఒక తేలిక భావం, ఒక నిర్లక్ష్యం సుమ పిల్లలలో, ప్రతిదానిపట్ల ఒక ప్రత్యేక అభిమానం కిరణ్ పిల్లలలో కనిపించింది.

పల్లెటూరికి వెళ్ళగానే అందరూ ఎగిరి గంతేస్తారనుకున్న నా అంచనాలు తల్లక్రిందులయ్యాయి. "ఏంటి నాన్నా మీరు ఈ ప్లేస్ ఎందుకు ఎంచుకున్నారు? మా పిల్లలకి పడదు ఎలర్జీలు వస్తాయి ఈ విలేజ్‌లో" విసుక్కుంది సుమ. ఉన్నంతసేపు ముళ్ళమీద ఉన్నట్లే గడిపింది. కిరణ్ మాత్రం పూర్తిగా సంతోషపడిపోయాడు. సుమ, అల్లుడు వరుణ్ ముఖాలు మాడ్చుకున్నారు. "చక్కగా అన్నయ్యతో కలిసి సిటీలో ఉండి పార్టీలు, హోటల్స్, మూవీస్‌తో ఎంజాయ్ చేద్దామనుకున్నాము. మీరేంటి ఇలా చేశారు?" అనేసింది.

మూడురోజులు గడిచాయో లేదో ఇంక వెళ్ళిపోవాలని మొరాయించింది సుమ. చేసేది లేక తిరిగి వచ్చాము. రావడం రావడం ఎంతో హుషారుగా మారిపోయింది సుమ. ఈ రోజు ఎక్కడికి వెళ్ళాలి, ఏం షాపింగ్ చేయాలి? ఏ హోటల్‌కి వెళ్ళాలి అని. అమ్మ ఏం చేసిపెడుతుందా తిందామని ఎదురుచూసిన కిరణ్ చెల్లెలి ఆరాటానికి తలవంచక తప్పలేదు. తన మనసు నొప్పించడం ఇష్టం లేక రెండురోజులు సుమ ఇష్టప్రకారం తిరిగారు. మూడోరోజు సుమకు, వరుణ్‌కు సెలవులు లేక తిరిగి పూనె వెళ్ళిపోయారు.

సుమ వాళ్ళు వెళ్ళగానే ఇల్లు సగం చిన్నబోయింది. కిరణ్ మరో రెండురోజులు అవగానే రూమ్‌లోకి వెళ్ళిపోవడం, లాప్‌టాప్ ముందు కూర్చోవడం "వర్క్ ఫ్రమ్ హోమ్" అని గదిలోనే ఉండిపోయేవాడు. పగలంతా పడుకోవడం జరిగేది.

పిల్లలు కోడలు క్రమంగా ఉత్సాహం తగ్గిపోయి ఎప్పుడు వెళ్ళిపోదామా అన్న పద్ధతిలోకి మారిపోయారు.

లావణ్య ఏం చేసిపెట్టాలా, ఏమేమి వారికిచ్చి పంపాలా అని నిమిషం తీరికలేకుండా పనులు చేస్తూ అలిసిపోతోంది. చూస్తూ చూస్తూ వాళ్ళు వెళ్ళాల్సిన రోజు వచ్చేసింది. ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళి సాగనంపి తిరిగి వచ్చి నేను వాలుకుర్చీలో సాగిలపడ్డాను. లావణ్య చాలా అలసిపోయింది.

"పోనీ ఓ రోజు సెలవు పెట్టి విశ్రాంతి తీసుకోరాదూ!?" అన్నాను.

"లేదండీ ఇప్పటికే వాళ్ళకోసం సెలవులు చాలా పెట్టేసాను. ఇంక పెట్టలేను" బ్యాగు తగిలించుకుని బయలుదేరింది ఆఫీసుకి.

సాయంత్రం వాకింగుకి వెళ్తూ కిరణ్ వాళ్ళకు చేసిన పిండివంటలు, పచ్చడి కొంచెం తీసుకెళ్ళి సుబ్బారావుగారికిచ్చాను. "ఏంటండీ రామచంద్రరావుగారు వెళ్ళిపోయారా పిల్లలు? ఈ మధ్య వాకింగ్‌కు కూడా సరిగ్గా రావడంలేదు' పలకరించారు సుబ్బారావుగారు.

"ఆ వెళ్ళిపోయారండి. అమ్మాయి ముందే వెళ్ళింది. అబ్బాయి నిన్నరాత్రే వెళ్ళాడు."

నడుస్తూ నడుస్తూ చెట్టుకింద కూర్చున్నారు.

"మీ పిల్లలు హేపీయా?"

"ఆ వాళ్ళు హేపీయే" అన్నాను నిర్లిప్తంగా.

"అదేంటి అలా ఉన్నారు?"

"నాకెందుకో పిల్లల తప్పులేదనిపిస్తుంది సుబ్బారావుగారూ"

"ఏ విషయంలో"

"అదే వాళ్ళకి పల్లెటూరు నచ్చే విషయాలలో. సుమ పట్నంలో పెరిగింది. పల్లెటూరు గురించిన బలమైన అనుబంధం బలవంతంగా రుద్దితే రాదుగా. అదే కిరణ్ పిల్లలకి చిన్నతనంలోనే పల్లెని గురించి చెప్పినవన్నీ వారికి ఆ పల్లె నచ్చేలా చేశాయి. చిన్నతనంలో చూపించేది నేర్పించేదే వారి మనసుల్లో బలంగా నాటుకుంటుంది. మధ్యలో ఎక్కిస్తే ఎక్కేది కాదుగా అభిమానం" అన్నాను నిట్టూరుస్తూ.

"వస్తానండి" ముందుకు సాగాను. మనసంతా ఆలోచనలే. నిజమే పల్లెని పరాయిగా భావించిన పిల్లలకి రేపు తల్లితండ్రులు పరాయిగానే అనిపిస్తారు. జనాలు మారిపోతున్నారు. తల్లితండ్రులని పట్టించుకోవడంలేదు. విదేశాలకి వెళ్తున్నారు. వృద్ధాశ్రమాల్లో చేరుస్తున్నారు అంటూ పిల్లల్ని విమర్శించే ముందు మనమేం చేశాం? మనమేగా పల్లెనుంచి పట్నానికి, పట్నం నుంచి విదేశాలకి వాళ్ళని సాగనంపింది. ఇంక ఆలోచనలకి తావివ్వకుండా భవిష్యత్తులో మనవళ్ళు మనవరాళ్ళ మెదళ్ళలో పల్లెలపట్ల తల్లితండ్రులపట్ల గట్టి పునాదులు వేసే సంకల్పంతో నా అడుగులు హుషారుగా ముందుకు సాగాయి.

**Click here to share your comments on this story**